# గ్రీటింగ్ కార్డు

'హావిస్'



## ఆ దేచిత్రం—కొందరిని విడదీసింది కాని మరికొందరిని సన్నిహితులను చేసింది !

హాల్లో బల్లమీది పుస్తకాలు సర్దుతూ కూని రాగాలు తీస్తోంది శశిరేఖ ఆరోజు ఆదివారం తన కాలేజీకి సెలవు. నాన్నగారు కూడా ఇంటోనే ఉంటారు. ఆయన మనస్సు చాలా మంచిది. తాను ఆయనకు సహాయం చేస్తున్నట్లు కన బడితే ఆయన మరింత ఖుష్ అవుతాడు. అప్పుడు తానేది కోరినా నెరవేరి తీరుతుంది.

సంక్రాంతిపండగ వెళ్లిపోయి వారం రోజు లైంది పండగ మరునాటి సాయంత్రంనుంచీ శశిరేఖ మనస్సు ఒక వస్తువుమీద నిమగ్నమయి పోయింది. మ్యూజియం హాల్లో అఖిలభారత చిత్ర కళాప్రదర్శనం జరుగుతోంది. దేశం నాలుగు చెరగుల్నించి ప్రఖ్యాత చిత్రకారులు, ఔత్సాహిక చిత్రకారులు ఎన్నో అందమయిన చిత్రాలు పంపిం చారు. అంతా కన్నులపండుగ చేసే కళా ప్రపంచం చిత్రకళయందు అపరిమితమయిన ఆసక్తీ, కొద్దిగా ప్రవేశమూ ఉన్న శశిరేఖకు అందులో ఒక చిత్రం ఎంతో నచ్చింది.

చిత్రకారుడు 'అభిసారిక' అన్నాడా చిత్రాన్ని.

అందులో,

ఎంత అందమయిన చిత్రం !

అపూర్వమూ, అనితర సాధ్యమూ అనిపించే వర్ణసమ్మిశ్రంతో, సజీవతా భాసురంగా, సమ్మో హనకరంగా ఉన్న ఆ కళాఖండాన్ని ప్రతిరోజూ వెళ్లి సందర్శించి మధురమైన వూహలతో ఇల్లు జేరుకునేది ఆమె

ఆ చిత్రం వేసిన వ్యక్తిపేరు 'సత్య'

ఆ చిత్రానికి పోటీలో ప్రధమ బహుమతి వస్తుందని శశిరేఖ విశ్వాసం మిగతా చిత్రాల్లో 'నిరీక్షణ' పోటీకి నిలవబడినా ప్రధమ స్థానం 'అభిసారికదే'. ఒకవేళ ఏకారణంచేత నయినా అందుకు భిన్నం జరిగినా 'అభిసారిక' తన గదిని అలంకరించి తన మనసు యిచ్చే ప్రధమ బహు మతి స్వీకరించితీరాలి గదా ?

అందుకు తాను ఆ చిత్రం కొనితీరాలి.

శశిరేఖ తండ్రి కృష్ణమూర్తిగారు శ్రీమంతుల యింట్లో పుట్టినవాడు. ఏకైక పుత్రికను పువ్వుల్లో పెట్టి పెంచుకుంటున్నాడు. తల్లి సీతమ్మగారికి శశిరేఖ అంటే అమితమయిన గారాబం

అయినా తన కోరికను తండ్రికి చెప్పటానికి వెనుకంజ వేస్తోంది. శశిరేఖ. చిత్రకళాప్రదర్శన నిర్వాహకులు నిర్ణయించిన ప్రధమ బహుమతి రెండువేల రూపాయల రొఖ్ఖం అంటే తాను ఆ చిత్రానికి అంతకన్నా ఎక్కువే మూల్యం చెల్లిం చాల్సి వస్తుందన్నమాట దమ్మిడీ దమ్మిడీకీ లెక్క చూసుకునే తన తండ్రి, ఒక తైలవర్ణ చిత్రం కొనడానికి అంత డబ్బు యిస్తాడా ?

వ్యాపారంలో అద్భుతమయిన తెలివితేటలూ, కావలసినంత డబ్బూ యిచ్చి తన తండ్రికి కళా త్మక హృదయం యివ్వనందుకు దేవుడిమీద విసు క్కుంది శశిరేఖ

అదొక్కటే అడ్డంకు అయితే ఎలాగోలా సరి దిద్దుకురావచ్చు. నాలుగు అయిదు రోజుల క్రితం నుంచీ కృష్ణమూర్తిగారు ఒక వ్యక్తిమీదా, కించిత్ తనమీదా కూడా కోపంగా ఉన్నాడు.

తండ్రి కోపం విషయం గుర్తుకు రాగానే శశి రేఖకూ ఆ వ్యక్తిమీద వళ్లు మండిపోయింది.

అతను సూర్యం.

సంక్రాంతిపండగనాడు ఉదయం పది గంట లకి పోస్టులో ఆమె కొక గ్రీటింగ్ కార్డు వచ్చింది. రాధామాధవుల ప్రణయవిలాసం అచ్చొత్తబడి 'డార్లింగ్ శశిరేఖకు, సూర్యం' అన్న సెల్యు టేషన్‌తో ఆ కార్డు కంటబడేసరికి కృష్ణమూర్తి గారు ఉగ్రుడైపోయాడు.

అతను ......

సూర్యం కృష్ణమూర్తిగారి ఆబాల్య మిత్రుడూ దూరపు బంధువూ అయిన గురునాధరావుగారి ఏకైక పుత్రుడు. అతను ఇంటర్‌మీడియేట్ చదువుతోండగా గురునాధరావుగారు మరణిం చారు. బ్రతికుండగా గురునాధరావుగారు దర్జా కోసం చేసిన ఖర్చులు ఆ తరువాత అప్పుల రూపంలో సాక్షాత్కరించడంతో ఉన్న పొలం కాస్తా అమ్మి అవి తీర్చాడు సూర్యం మిగిలిన చిన్న పెంకుటింట్లో తలదాచుకుంటూ ఎలాగో బి. యే పూర్తిచేశాడు కృష్ణమూర్తిగారు కీర్తి శేషుడయిన మిత్రుడిమీద ఉన్న అభిమానం పురస్క రించుకొని సూర్యానికి ధనసహాయం చేస్తానని ముందుకు వచ్చినా సూర్యం, ముఖ్యంగా అతని తల్లి దుర్గమ్మగారు అంగీకరించలేదు చేసేదిలేదు గనుక ఆయన వూరుకున్నాడు

బి. యే పూర్తయిన వెనుక సూర్యానికి ఉద్యోగం వెంగపట్టుకున్నది ఉన్న యిల్లు కాస్త కూడా తాకట్టులో ఉంది మహాసాగరంలా విరు చుకు కనబడింది భావి జీవితం అది దాటడానికి 'నైసా' కావాలి. అందుకు ఉద్యోగం అవసరం.

ఆ సమయంలో తిరిగి కృష్ణమూర్తిగారు సూర్యాన్ని అడిగాడు తన మిల్లులో ఏదయినా ఉద్యోగం యిప్పిస్తాను చెయ్యమని. అయినవాళ్ల దగ్గర ఉద్యోగం అంగీకారయోగ్యం కాదనుకున్నా అతను ఒప్పుకున్నాడు.

కృష్ణమూర్తిగారు సంతోషించాడు.

గురునాధరావుగారికి, కృష్ణమూర్తిగారికి ఉన్న స్నేహం ఎంతటిదీ అంటే శశిరేఖ, సూర్యం చిన్న వాళ్ళుగా ఉండగా వా రిద్దరికీ పెళ్లి చేయాలని అనుకున్నారు వా రిద్దరూ. కాని కాలక్రమేణా ఆ ఆలోచన సన్నగిలింది—ముఖ్యంగా కృష్ణమూర్తి గారిలో ఆయనకు మిత్రుడంటే అభిమానమే. కాని ఆయనకూ కొన్ని నమ్మకా లున్నాయి. గురు నాధరావు తరువాత సూర్యానికి 'డబ్బు' ఏమీ మిగలదు విలాసజీవితానికి అలవాటుపడ్డ శశిరేఖను అతను తనతో సమానంగా ట్రీట్ చెయ్యలేడు.

ఫలితం ఆవేదన....రసాభాసం ..

అందువల్ల అడపా దడపా ఎవరన్నా దగ్గిర వాళ్ళు శశిరేఖా సూర్యంల వివాహ ప్రసక్తి ఎత్తితే ఆ విషయం జరగనిదిగా సూచించేవాడు ఆయన. క్రమేణా అందరూ ఆ విషయం మర్చిపోతున్నారు.

కాని, సూర్యం మాత్రం మర్చిపోలేదు. అను కున్నాడు కృష్ణమూర్తిగారు ఆ గ్రీటింగ్ కార్డు చూడంగానే. ఆయనకు అతనిమీద విపరీతమయిన అసహ్యం కలిగింది. ఏం చూసుకుని సూర్యం ఆ పనికి సాహసించాడు ? శశిరేఖ అంతస్తులో ఎన్నో వంతు అతని స్థాయి ? లాంటి ఆలోచనలు కలిగాయి.

అసలు సూర్యం బుద్దే అలాంటిదేమో ?

అతను బి.ఎ. చదువుతున్న రోజుల్లో అతన్ని గురించి ప్రచారమయిన ఒక వార్త యింకా కృష్ణమూర్తి గారు మర్చిపోలేదు. ఆ రోజుల్లో శశిరేఖతోపాటు పి. యు. సి. లో పద్మావతి అని మరో అమ్మాయి చదువుతోండేది. అందమయిన అమ్మాయి. కాస్త ఉన్నవాళ్ల అమ్మాయి. ఎలాగో సూర్యానికి ఆ అమ్మాయికీ స్నేహం కలిసింది. ఆ స్నేహాన్ని ఆధారం చేసుకుని సూర్యం ఆమెకు ఒక ఉత్తరం వ్రాశాడుట తనను పెళ్లి చేసుకోవటానికి అభ్యం తరం ఏమన్నా ఉందా ? అని. ఆ విషయం కాలే జీలో గుప్పుమంది. సూర్యం మంచిపేరు పోయింది. చావుదప్పి కన్ను లొట్టబోయినంత పనయి అతను ఎలాగో ఆ ఏడాది పరీక్ష పాసయ్యాడు

అలాగే యిప్పుడూ శశిరేఖకి కార్డు పంపించా డనుకున్నాడు కృష్ణమూర్తిగారు. అతనితో చను వుగా మాట్లాడుతున్నందుకు శశిరేఖను కూక లేశాడు అతని సంగతేమిటో తేల్చుకోవటానికి ఆదివారం ముహూర్తం పెట్టాడు

అతనంటే శశిరేఖకు ప్రత్యేకమయిన అభి ప్రాయం ఏమీలేదు. ఉండటానికి అవకాశం మాత్రం ఏముంది ? సూర్యం నలకూబరుడు కాదు ఏ కళలోనూ ఆరితేరినవాడు కాదు. కనీసం డబ్బుగలవా డయినా కాదు.

అతని క్వాలిఫికేషన్ బోడి 'బి. ఏ'

అతని ప్రస్తుతపు ఆదాయం ఆమె తండ్రి యిస్తున్న వంద రూపాయలూ, చలపతిరావుగారి కొడుక్కి చదువు చెబుతున్నందుకు ఆయన యిస్తున్న ఇరవయి రూపాయలున్నూ.

అక్కడే కొద్దిగా ఆశ్చర్యం కలిగేది శశిరేఖకి. చలపతిరావుగారు మామూలు చిన్న పబ్లిషరు. ఆయన ఆదాయం మహా అయితే నెలకు మూడు వందలు ఉంటుంది. ఆయన యిరవై రూపా యలు ఖర్చుపెట్టి తన కొడుక్కి మూడో తర గతి చెప్పిస్తున్నాడా ?

ఆమె అనుమానం ఇందుకు కారణం సత్యవతి ఏమోనని !

సత్యవతి చలపతిరావుగారి కూతురు. తనకు క్లాసుమేటు ఆమెకు ఎందుకోగాని సూర్యం అంటే అభిమానం. అందువల్లే సూర్యం స్థితికి జాలిపడి అంత డబ్బు యిప్పించి చదువుకోసం అతడిని నియమింపజేసేందేమో నని శశిరేఖ అనుమానం.

(55 వ పేజీ చూడండి)

## గ్రీటింగ్ కార్డ్

(13-వ పేజీ తరువాయి)

సూర్యానికి కూడా సత్యవతి అన్నా, ఆమె కుటుంబం అన్నా అభిమానమే నేమో అని అనుమాన పడింది శశిరేఖ ఆంగ్ల సాహిత్యకారుల మనస్తత్వశాస్త్రాన్ని ఆకళింపుజేసుకొన్న ఆమె అంతరాత్మ 'అందులో అసూయ లేదూ ?' అని ప్రశ్నిస్తే 'చప్' అని నోరు మూయించిం దామె.

ఏమయినా సూర్యం ఒక పెద్ద సినిక్ అతని తోడి బాంధవ్యం తమకు అనవసరం .

ఆలోచనల్తో కుర్చీలో కూర్చుండిపోయిన శశిరేఖ అలికిడికి మేలుకుని గుమ్మంవైపు చూసింది

"హలో శశీ" అన్నాడు సూర్యం నవ్వుతూ.

ఇష్టంలేని మొహంతో లేచి నుంచుంది శశిరేఖ "నాన్నని పిలుస్తాను కూచో" అని లోపలికి వెళ్ళిపోయింది

సూర్యం నవ్వుకున్నాడు కూచుంటూ శశిరేఖ సన్నగా బంగారుతీగెలా ఉంటుంది. అమాయకమయిన ముఖం మెరుస్తూండే కళ్ళు ఆమె మనసు కూడా పసిపిల్ల మనసులా నిర్మల మయినది ఆ పసితనమే అతని కిప్పుడు నవ్వు తెప్పించింది

"ఏవిటోయ్ నీలో నువ్వే నవ్వుకుంటున్నావ్ ?" అన్నాడు కృష్ణమూర్తిగారు లోపలికి వస్తూ.

"ఏంలేదు" అన్నాడు సూర్యం చిరునవ్వుతో

"ఆ గదిలోకి పోయి కూచుందాం పద" అన్నాడు కృష్ణమూర్తిగారు అటు దారితీస్తూ

సూర్యం కూడా వెళ్ళాడు ఇద్దరూ కూచున్నాక "అమ్మగారు కులాసాగా ఉన్నారా ?" అన్నాడు కృష్ణమూర్తిగారు

"ఆ" అన్నాడు సూర్యం

"ఉద్యోగం ఎలా ఉంది ?"

"బాగానే ఉంది"

కృష్ణమూర్తిగారు ఒక్క క్షణం ఆగి సాలోచనగా అన్నాడు "గుర్నాధం నేనూ గడిపిన రోజులు, చేసిన పనులు గుర్తు వస్తే మనసంతా అర్ద్రోలా అయిపోయింది ఒక కంచంలో తిని ఒక మంచంలో పడుకున్నట్లుగా మెలిగాము వాడి నూకలు చెల్లిపోయాయి తల్చుకుంటే ఎంతో బాధగా ఉంటుంది

సూర్యం కళ్ళు చెమర్చాయి చిన్నతనంలోనూ, ఆయన బతికున్నంతకాలమూ కృష్ణమూర్తిగారిని గురించి ఎన్నో విషయాలు చెబుతుండేవాడు గురునాధరావుగారు కొడుక్కు ఆ మాటల వల్ల వారి మైత్రీబంధపు రూపాన్ని వూహించుకునేవాడు సూర్యం

"కొందరు మనుషులు మర్యాదకోసం, గౌరవం కోసం ఎంత త్యాగమయినా చెయ్యడానికి సిద్ధంగా ఉంటారు మీనాన్న అలాంటివాడు"

సూర్యం మాట్లాడలేదు

"ఆయన గౌరవాన్ని కాపాడవలసిన బాధ్యత నీది" అంటూండగా పనిమనిషి కాఫీ కప్పులు తీసుకువచ్చింది.

"కాఫీ తీసుకో."

సూర్యం కప్పు అందుకున్నాడు

ఆయన కాఫీ చప్పరిస్తూ "ప్రతీ మనిషి జీవితంలోనూ కొన్ని పొరపాట్లు జరుగుతుంటాయి తాత్కాలికమయిన ఆవేశంవల్ల కొన్ని మాటలు అనిస్తూండటం జరుగుతుంది వివేకవంతుడయినవాడు వాటిని పట్టుకు ఆశలు, నిరాశలు పెంచుకోడు" అన్నా డాయన

కాఫీలు తాగడం పూర్తయింది పనిమనిషి వచ్చి గ్లాసులు తీసుకు వెళ్ళిపోయింది

"నువ్వు నాకు కావల్సినవాడివి నిన్ను వృద్ధిలోకి రాగా చూడాలని నాకు ఉంటుంది అందువల్ల నువ్వూ నాకూ, నా వాళ్ళకీ గౌరవం యివ్వడం అవసరం"

సూర్యానికి ఆయన అంటున్న దేమిటా అనే ఆలోచన యిప్పుడు కలగసాగింది ఆయన మాటల్లో తా నేదో అనుచితమయిన కార్యం చేసినట్లు ధ్వనిస్తోంది. ఏమిటా పని ?

"అర్థం అయిం దనుకుంటాను"

"లేదు" అన్నాడు సూర్యం గొంతు సరిచేసుకుంటూ.

> పెద్ద మనిషి:-(సినీమా హాలులో) ఏమండీ ఇందాక నేనేనా మీకాలును తొక్కినది?
>
> మరొక పెద్దమనిషి:- అవును మీరే! అబ్బా రక్తం కూడ చిమ్ముతున్నది.
>
> పెద్ద మనిషి:- హమ్మయ్య ఇప్పటికి నా వోటు దొరికింది.
>
> ముద్లగడ్డి జానకీదేవి (విజయనగరం)

"శశిరేఖ సంగతి సూర్యం అది లక్షాధికారిణి దాన్ని నీ కిచ్చి పెళ్లి చెయ్యడం అసంభవమే కాక అనుచితం కూడా కనుక ఆ ఆశలు పెట్టుకోవద్దు"

"క్షమించండి నా కలాంటి వూహ లెన్నడూ లేవు" అన్నాడు సూర్యం దెబ్బతిన్న మనస్సుతో

కృష్ణమూర్తిగారి కనుబొమలు ముడివడ్డాయి ఆవేశాన్ని అణుచుకుని కూతుర్ని కేకవేశా డాయన

శశిరేఖ వచ్చింది

"ఆ కార్డు తీసుకురామ్మా"

నాలుగయిదు క్షణాల తరువాత ఆమె దాన్ని తీసుకొచ్చి తండ్రి కిచ్చి నిలవకుండా వెళ్లిపోయింది

"దీని అర్థం ఏమిటి ?" అన్నా డాయన దాన్ని సూర్యం ముందు పడేస్తూ

సూర్యం దాన్ని తీశాడు

ఇండియన్ ఇంకుతో అందమయిన అక్షరాలలో "డార్లింగ్ శశిరేఖకు, విత్‌లవ్—సూర్యం" అని వ్రాసిఉంది అందంగా అచ్చొత్తబడిన రాధామాధవ చిత్రం

సూర్యం నిశ్చేష్టు డయ్యాడు.

"ఎందుకు పంపావది ?"

స్పృహ రావడానికి అరనిముషం పట్టింది సూర్యానికి వణుకుతున్న గొంతుతో "అది నాది కాదు" అన్నాడు

"బూకరిస్తున్నావా ?"

సూర్యం అభిమానం దెబ్బతిన్నది "ఆ అవసరం నాకు లేదు . శశి నాకు చెల్లెలి వంటిది. నేను పంపలేదు" అన్నా డతను రోషంగా

కృష్ణమూర్తిగారు లేచి నిలబడ్డాడు ఆయనకిది అంతా నాటకంగా తోచింది తాను పంపలేదట !

"గెటవుట్"

సూర్యం ముఖం మాడిపోయింది చేతిలో కార్డును బల్లమీద విసిరికొట్టి "మళ్లీ మీరు కబురంపించిననాడే మీ ముఖం చూస్తాను ... సెలవు" అన్నాడు చరచర నడిచి వెళ్లిపోతూ

అరనిముషం తరువాత కోపానలం కొంత శమించాక 'స్కౌండ్రల్' అన్నమాట వెలువడింది ఆయన నోటివెంట .. .

ఆవేదనతో, అవమానంతో మండిపోతున్న హృదయంతో రోడ్డుమీద నడవసాగాడు సూర్యం అది ఎవరు పంపిఉంటారన్న సమస్యకన్నా జరిగిన అవమానాన్నిగురించి ఎక్కువ బాధపడుతున్నా డతను

ఏమనుకుంటున్నా డాయన తనను గురించి ? తాను అంత అల్పుడా ? ఆయన డబ్బుకోసం కక్కుర్తి పడేటంత నీచుడా ?

రోషం ఉపశమించుతూండగానే అశ్రువులు కమ్ముకో సాగాయి అతని నయనాలను

అతని పాదాలు అప్రయత్నంగా చలపతిరావు నాయుడిగారింటికి దారితీశాయి

సత్యవతి రోడ్డువేపు చూస్తూ నిల్చుంది గుమ్మంలో సూర్యం రావడం చూసి "రండి" అంది లోపలికి వెళుతూ

సూర్యం కూచున్న కొన్ని క్షణాలదాకా మాట్లాడలేక పోయాడు అతని తీరు చూసి ఏదో బాధాకరమయిన సంఘటన జరిగి ఉంటుందని వూహించుకున్న సత్యవతి "ఏమయింది ?" అన్నది లాలనగా.

ఇందాకటినుంచీ అతని హృదయంలో చెలరేగుతున్న తుఫాను నంతటినీ కక్కేశాడు సూర్యం అలా చెబుతోంటే అతని నయనాలనుండి అశ్రువులు ధారగా స్రవించాయి

పసిపిల్లవాడిలా అతను చెప్పుకుపోతూంటే మాతృప్రేమతో వినసాగింది సత్యవతి ఆమెకు అతనంటే మొదటినుంచీ జాలితో కూడిన అనురాగం నిరాడంబరంగా, అమాయకంగా ఉండే సూర్యానికి తాను 'దాది' అయితే, రేగిపోయివుండే ఆ జుట్టుని సవరించి, అందమయిన బట్టలు తొడిగి, అందమయిన ఆ కళ్ళు ఆనందాన్ని చిమ్ముతోంటే అతని పసి మనసు తనతో దాగుడుమూతలు ఆడుకుంటే , తనకు అంతకన్నా ఏం కావాలి ?

కాని ఆ కోరిక నెరవేరేది కాదు. అతనికీ తనకూ 'కులం' అడ్డు నిలుస్తోంది

ఆమె అతను చెప్పిందంతా విన్నది

"ఏం చెయ్యమంటావు చెప్పు సత్యవతి ?"

అన్నా డతను చివరికి.

"ఉద్యోగానికి రాజీనామా యిచ్చారుగా ?" అన్న దామె పేలవమయిన నవ్వుతో.

"అంటే ?"

"ఏమీలేదు లెండి .... ఇంతకీ ఆ కార్డు పంపించిం దెవరు ?"

"ఏమో ?" అన్నాడు విసుగ్గా సూర్యం.

"అతన్ని పట్టుకుని ఆ విషయం అతనిచేతే కృష్ణమూర్తిగారికి చెప్పించండి."

"అవునవును !" అన్నాడు సూర్యం సంబరంగా. మరుక్షణాన నీరు గారిపోయి "అత నెవరో ఎలా తెలుసుకోవడం ?" అన్నాడు.

## గ్రీటింగ్ కార్డ్

"ఎవరన్నా డిటెక్టివ్‌ను పిలిపించండి" అన్నది సత్యవతి నవ్వుతూ.

"అలాగే ఉంది" అన్నా డతనూ నవ్వుతూ.

అలా కాస్త ఆవేదన తగ్గడంతో మామూలు ప్రపంచంలో పడ్డాడు సూర్యం. ఆ సమయంలో ఆ గదిలో వో మూలగా బుంగమూతితో కోపంగా కూచునివున్న అతన ప్రియశిష్యుడు రామం కన బడ్డాడు.

"ఏవిటాయన అలా కూచున్నాడు ?" అన్నాడు సూర్యం.

"ఆయనగారికి అర్జంటుగా సరస్వతి పటం కావాలిట" అన్నది సత్యవతి చిరుకోపంతో

"వోస్ యింతేనా ? నేను తెచ్చిస్తానులే సాయంత్రం" అన్నాడు సూర్యం

వాడికి గురువుగారి మాట అంటే వేదాక్షరం. కోపగృహం వదిలేసి "నిజంగా" అంటూ గురువు గారి దగ్గరకు చేరాడు

"వో అన్నట్లు ఎగ్జిబిషన్ యివాళ ఆఖరు అనుకుంటాను మీరంతా రారూ ?" అన్నాడు సూర్యం సత్యవతితో

"ఎందుకు రాం ?"




"అయితే ఇకనేం ? అక్కడికే తెచ్చి యిస్తాను టేవోయ్" అన్నాడు సూర్యం శిష్యుడితో

రామం ముఖం తేటపడింది

గోడమీది గడియారం పన్నెండు కొట్టింది

"నే నిక వెళ్తాను సత్యవతీ సాయంకాలం ఎగ్జిబిషన్‌లో కలుసుకుందాం" అన్నాడు సూర్యం లేస్తూ

ఆమె అతనితోపాటు వీధిగుమ్మందాకా వచ్చింది

అతను రెండడుగులు వేశాక "పటం మర్చిపోకండి మాష్టారూ ?" అన్నాడు రామం గట్టిగా

"అలాగే" అతను వెళ్లిపోయాడు

అతని అమాయకత్వాన్నిగురించే ఆలోచించుకుంటూ కూచుండిపోయింది సత్యవతి కొంత సేపటిదాకా తండ్రి మాటలతో ఆమె స్పృహలోకి వచ్చింది

"నీ బొమ్మకే ఫస్టు ప్రయిజు వస్తుందిటమ్మా ఎంతో మెచ్చుకున్నారట 'అభిసారిక' ను" అన్నాడు నాయుడుగారు లోపలికి వచ్చి నవ్వుతూ

"అంతా అనుకున్నదేగా ?" అన్నది సత్యవతి

ప్రదర్శన ప్రారంభమయిన నాటినుంచీ చలపతిరావు నాయుడుగారు ఆ చిత్రానికీ, సత్యవతికీ ఉన్న పోలికల్ని వివరించి ఆమెను వేళాకోళం చేసేవాడు సత్యవతికీ ఆ మాటల్లో కొంత నిజం కనపడేది 'అభిసారిక' లో తన పోలికలు కనపడటం చిత్రమే !

అయితే ఎన్ని చిత్రాలు నిజం కావటంలేదు ?

## 2

చిత్రకళా ప్రదర్శనం ఆఖరిరోజు కావటం మూలాన, ఆదివారం కావటం మూలాన మ్యూజియం గ్రౌండ్సులో ఇసుకవేస్తే రాలనంతగా జనం పమకూడారు

ఒక్కొక్క చిత్రమే పరిశీలనగా చూస్తూ కృష్ణమూర్తిగారు శశిరేఖతో 'అభిసారిక' వద్దకు వచ్చాడు

ఎందరో కళాభిమానులు, కళాకారులు, విద్యార్థులు, సామాన్య ప్రేక్షకులు ఆ చిత్రంవద్ద నిలబడి ప్రశంసాపూర్వకంగా మాట్లాడుకుంటూ ఆ చిత్రాన్ని తిలకిస్తున్నారు ఆ ప్రక్కనే ఆవిష్కరింపబడివున్న 'నిరీక్షణతో' 'అభిసారిక'ను పోల్చి, రెండిటిలోని కళనూ విమర్శించుకొంటున్నారు తులనాత్మకంగా కొందరు ఆ రెండిటిలోనూ ఒక దానికి ప్రథమ బహుమతి, రెండవ దానికి ద్వితీయ బహుమతి ఖాయమని తేల్చి చెప్పుకుంటున్నారు చాలామంది 'అభిసారికే' ననసాగేరు

కృష్ణమూర్తిగారు అదంతా గమనించారు ఆయనకు చిత్రకళలో ప్రవేశం లేదు కనీసం అభిరుచి అయినా లేదు కాని ఆయనకూ కొంతవరకూ ఆ చిత్రం నచ్చింది ప్రేక్షక జనసందోహం 'దానిని' అపరిమితంగా మెచ్చుకోవడం చూచిన తరువాత ఆయన కొక ఆలోచన కలిగింది

ఆ బొమ్మ తను కొంటే

ఆయనకు ఉన్న ధనికత్వం, కీర్తికండూతి ఆయన నా నిర్ణయానికి తీసుకురా సాగింది జరుగుతున్నది అఖిలభారత చిత్రకళా ప్రదర్శనం అందులో ప్రశంస పొందబోతున్నది 'అభిసారిక'. దానిని తన యింట్లో అలంకరిస్తే తనకు రాగల కీర్తిప్రతిష్టలు అపరిమితం మాహో అయితే దాని ఖరీదు మూడు వేలో, నాలుగువేలో ఉంటుంది

"ఎలా ఉందమ్మా బొమ్మ ?" అన్నా డాయన కూతురుతో

"చాలా బావుంది" అన్నది శశిరేఖ ఉల్లాసాన్ని దాచుకుంటూ

కొనమంటావా ?"

"మీ యిష్టం"

కృష్ణమూర్తిగారు అక్కడే నిలబడిఉన్న ప్రదర్శన నిర్వాహకోద్యోగితో "ఈ బొమ్మ వేసిం దెవరో చెబుతారా ?" అన్నాడు

ప్రేక్షకులంతా హఠాత్తుగా ఆయనవైపు తిరిగారు

"సత్య" అన్నాడు ఉద్యోగి.

"వారు వచ్చారా ?"

"కొద్దిసేపట్లో వస్తారు సార్"

"నాపేరు ఎస్ కృష్ణమూర్తి కాంటీన్‌లో కూచుని ఉంటాను ఆయన రాంగానే నాకు కబురు చెయ్యండి" అన్నాడు కృష్ణమూర్తిగారు కదలబోతూ.

> "ఆరోజు ఒకాయన ఎప్పుడూ రోడ్డుమీద తిరిగే ఒకవ్యక్తితో మీరు ఎప్పుడూ ఇంటికి వెళ్ళరా?" అని అడిగేరు. అప్పుడా వ్యక్తి "మహాత్ములకు లోకమే కుటుంబం అని జవాబిచ్చాడు."
>
> పి. బి. రవీంద్రరాజు (అనకాపల్లి)

"చిత్రాన్ని కొందామని మీ అభిప్రాయం అయితే అరుగో ! రంగారావుగారు వస్తున్నారు వార్ని అడగండి" అన్నాడు ఉద్యోగి

ఆ రంగారావుగార్ని చూసి ముఖం వికసింపచేసుకున్నాడు కృష్ణమూర్తిగారు

ఆయనపని అంతే అయింది

"ఎప్పుడు వచ్చావురా విజయనగరం నుంచి ?" అన్నాడు కృష్ణమూర్తిగారు మిత్రుడితో

"వారంరోజు లయింది భాయ్ ! ఏర్పాట్లతో తీరికలేక రాలేదు ఏమనుకోకు" అన్నా డాయన నవ్వుతూ

కుశలప్రశ్నాదికాలు అయినాక "ఈ 'సత్య' ఎవర్రా పొండూ ?" అన్నాడు కృష్ణమూర్తిగారు.

"ఏం ?"

"ఆ చిత్రం కొందా మనుకుంటున్నాను"

"చాలా అవుతుంది"

"ఏం అయితే "

"అలాగయితే సరే ! బహుమతులు పంచడం అయిపోయిం తర్వాత కనబడు సరయిన ధర వేయించి యిప్పిస్తాను"

"థాంక్స్ ! .... మర్చిపోకు" అన్నాడు కృష్ణమూర్తిగారు కూతురుతో బయటకు వస్తూ

హాల్లోంచి గ్రౌండ్‌లోకి అడుగు పెడుతూనే శశిరేఖ కొంతదూరంలో సత్యవతితో చలపతిరావు నాయుడుగారితో రామంతోపాటు కబుర్లు చెబుతూ నవ్వుకుంటున్న సూర్యం కనబడ్డాడు. మాటిమాటికీ అతను రామం తల నిమురుతూ ఏదో అంటున్నాడు

ఆమె అనుమానాలు నిజమైనట్లయింది

తండ్రీ కూతుళ్లిద్దరూ పోయి కాంటీన్‌లో కూచున్నారు టిఫిన్ తింటున్నా శశిరేఖ మనస్సు సూర్యంమీదా సత్యమీదా ఆలోచిస్తూనే ఉంది .

గురువుగారు తెచ్చి యిచ్చిన సరస్వతి పటం తీసుకుని మాటిమాటికీ చూసుకుంటూ మురిసిపోతున్నాడు రామం. వాడి సంబరం చూసి అంతా నవ్వుకోసాగేరు

"పటం మాత్రం అద్భుతంగా ఉందోయ్ సూర్యం" అన్నాడు నాయుడుగారు

"థాంక్స్" అన్నాడు సూర్యం

"ప్రోగ్రాం ఎప్పుడు ప్రారంభమో కనుక్కు వస్తాను ఇక్కడే నుంచోండి" అని రామాన్ని తీసుకొని పెండాల్‌వేపు వెళ్లిపోయాడు నాయుడుగారు

సత్యవతీ సూర్యం మిగిలారు

"ఏమిటి ఆలోచిస్తున్నావ్ సత్యవతీ ?" అన్నాడు సూర్యం మామిడిచెట్టు నానుకుని నిలబడిన సత్యవతితో

"ఊ ?" అన్నది సత్యవతి

"ఏమిటి ఆలోచిస్తున్నావు ?" అన్నా డతడు ఆమెవంక చూస్తూ

ఆమె నీలరంగు కాశ్మీర్ సిల్కుచీరె కట్టుకున్నది లేత పసుపు చోళీ వేసుకున్నది జడలో పూలు తురుముకున్నది సహజశ్యామల మయిన కనులకు కాటుకతో సరిహద్దులు దిద్దుకున్నది. నుదుట నయాపైసంత బొట్టు పెట్టుకున్నది. నిండయిన విగ్రహంతో సత్యవతి సౌందర్యానికి ప్రతినిధిలా నిలబడి ఉన్నది

"ఏమీలేదు" అన్నది ఆమె

"బొమ్మ సంగతేనా ?"

"ఊ" అన్నదామె తల వంచుకుని.

"బావుందా ?"

"మీకు బాగోలేదా ?"

"నీకు కావాలా ?"

ఆమె నవ్వింది "నేను సత్యవతిని" అన్నది.

"అందుకు ఈర్ష్యపడుతున్నావా ?"

"నేనా ?" ఆమె పెదవులు చిరుకోపంతో కదిలాయి

"మరి ?"

"మీకు తెలియదా ?"

"అయితే సరే !"

నాయుడుగారు తిరిగి వచ్చాడు "వేదిక నద్దుతున్నారు పదండి పోయి కూచుందాం" అన్నాడు వాళ్లతో

నలుగురూ కదిలారు

కుర్చీలో కూచోబోతూ తమకు నాలుగు వరసల ముందు కూచునివున్న శశిరేఖనూ, కృష్ణ

మూర్తిగారినీ చూశాడు సూర్యం. అదే సమయాన శశిరేఖ కూడా అతనివంక చూసి ముఖం తిప్పేసుకుంది

పదినిముషాల తరువాత వేదిక పయికి ప్రదర్శనాధ్యక్షుడూ, న్యాయనిర్ణయం చేయవచ్చిన వారు చిత్రకళా సమాఖ్య కార్యదర్శి రంగారావుగారు విచ్చేశారు

వందేమాతరమ్‌తో సభ ప్రారంభమయింది

అధ్యక్షోపన్యాసం అయిం తరువాత కార్యదర్శి రంగారావుగారు తన నివేదిక చదవడం ప్రారంభించాడు. ఆ సమయంలో అడిగింది సత్యవతి సూర్యాన్ని గ్రీటింగ్‌కార్డు పంపించిం దెవరో తెలిసిందా అని

"మా కాశీపతి పంపాడుట" అన్నాడు సూర్యం

"కాశీపతి అంటే మీ పెదనాన్నగారి కొడుకా ?"

"ఊ"

"ఎందుకు ?"

"ఖర్మ ! మును పెప్పుడో మాటల మధ్యలో కృష్ణమూర్తిగారు నన్ను అల్లుడూ అని పిలిచాడు అని చెప్పాను దాన్నిబట్టి నే నెలాగూ ఆయన అల్లుణ్ణి కాబోతున్నానని గదా అని ఆపని చేశాట్ట"

"తిక్కమనిషిలా ఉన్నాడే ?"

"అత న్ననుకోవడం దేనికి ? ... అంతా నా నొసటి రాత" అన్నాడు సూర్యం.

"చాల్లెండి వేదాంతం" అన్నది సత్యవతి నవ్వుతూ

కార్యదర్శిగా తన నివేదిక చదవడం అయిపోయిన తరువాత రంగారావుగారు న్యాయమూర్తులను రెండు ముక్కలు మాట్లాడవలసిందిగా కోరాడు

శశిరేఖకు అదంతా చూస్తుంటే స్వప్నాల్లో స్వర్గాల్లో తేలిపోతున్నట్లు అనిపించసాగింది బహుమతులు అందుకోబోతున్న కళాకారుల అదృష్టం ఆమెలో కించిత్ ఈర్ష్యను కూడా కలిగించింది ఉపన్యాసకులు చెబుతున్నది వినిపించుకోకుండా ఆమె స్టేజి పక్కగా జరుగుతున్న తంతు చూడసాగింది

రంగారావుగారు మరో ఇరవయి రెండు, ఇరవై మూడేళ్ల యువకుడు మాట్లాడుకుంటున్నారు మాటిమాటికీ అతని భుజం తడుతూ రంగారావుగారు మాట్లాడుతూండటంతో బహుమానం అతనిదే అనుకున్నది

ఆమె మనస్సు కొంత బాధపడింది

ఆ యువకుడు పొట్టిగా, సన్నగా ఉన్నాడు పాంటూ, స్లాక్‌షర్టూ (నేతవి) వేసుకున్నాడు మూతిమీద ఈగ వాలినట్లున్న మీసాలు

"ఇతను కళాకారుడా ?" అనుకున్న దామె

మరుక్షణాన ఆమె మనస్సు మార్చుకున్నది ఇది కథకాదు జీవితం ప్రతి ఆర్టిస్టూ పైజామాలాల్చీ వేసుకొని క్రాపింగు నున్నగా దువ్వుకుని, కళ్లజోడు పెట్టుకొని ఉండాలి అని ఎక్కడుంది ?

కృష్ణమూర్తిగారికి 'సత్య' ఎవరో తెలుసుకోవాలనే కుతూహలం అధికంగా సాగింది ఒకటి రెండు సార్లు లేచి వెళ్లి రంగారావుని అడుగుదామనుకుని అందర్లో లేచి వెళ్లటం సభా మర్యాద

# గ్రీటింగ్ కార్డ్

కాదని పూరుకున్నాడు. పైగా మరో పది నిముషాల్లో ఎలాగూ అతగాడు వేదికమీదికి వస్తాడు ఆ తరువాత అతని చిత్రాన్ని తాను కొనేటప్పుడు అత డెలాగూ తనకు పరిచయం అవుతాడు

హర్షధ్వానాల మధ్య ఉపన్యాసం ముగిసింది రెండు మూడు నిముషాల తర్వాత రంగారావుగారు తిరిగి వేదికమీదికి వచ్చాడు బహుమతి ప్రదానం జరుగుతుందని ప్రకటించి 'సత్య' నూ 'హరి' నీ వేదికపైకి రావలసిందిగా ఆహ్వానించాడు

ప్రేక్షకుల్లో నిశ్శబ్దత ఆవరించింది

లేవబోతున్న సూర్యాన్ని చూసి "ఇంతసేపూ ఉండి యిప్పుడు వెళ్లిపోతారేం ? కూచోండి !" అన్నది సత్యవతి చెయ్యి పట్టుకుని

అత నా హస్తాన్ని మెల్లిగా తొలగించి 'పనుంది యిప్పుడే వస్తాను" అని వెళ్లిపోయాడు

తాను అతని చేయి పట్టుకున్నదా ? అనుకుని సిగ్గుపడింది సత్యవతి తలెత్తి వేదికవైపు చూసింది

> మిత్రులను చూడ్డానికని వెళ్లిన ఒకతన్ని ఒకమిత్రుడిలా ప్రశ్నించాడు.
>
> "ఏరా గాడిదా యిలా దయచేసావ్ ?"
>
> అతను:- "ఏదో తోటి మిత్రుల్ని చూసిపోదామని."
>
> టి. సూర్యనారాయణమూర్తి (వాల్తేరు)

మరుక్షణాన ఉలిక్కిపడింది

నిర్ణయానుసారం, అనన్యసామాన్యమయిన కళాఖండాన్ని చిత్రించి 'అభిసారిక' ప్రసాదించిన 'సత్య' ఉరఫ్ వి సూర్యనారాయణశర్మగారికి ప్రథమ బహుమతి యిస్తున్నాం" అన్నాడు రంగారావుగారు

బహుమతిని అందుకుని ప్రేక్షకులకు అభినందనలు తెలిపి వేదిక దిగబోయాడు సూర్యం

"అభిసారిక" ను ఆదరించి అలంకరించుకుందామని శ్రీ ఎస్ కృష్ణమూర్తిగారు అభిలషించారు వారి కళా రసజ్ఞతకు మా సమాఖ్య తరఫునా, చిత్రకారులు 'సత్య' గారి తరఫునా అభినందనలు" అన్నాడు రంగారావుగారు

ప్రేక్షకులు తిరిగి కరతాళధ్వనులు చేశారు

ఆ ప్రకటనకు సూర్యంలో కలిగిన చలనం అంతర్గతంగానే ఉండిపోయింది 'అభిసారిక' కర్త తానే అని తెలియకుండా కృష్ణమూర్తిగారు ముందుకు వచ్చాడంటే అందుకు కారణం శశిరేఖ అని అతనుకున్నాడు శశిరేఖమీద అతనికి జాలి కలిగింది.

కాని, తనిప్పుడు చెయ్యగలిగిం దేముంది ?

తిరిగి ప్రేక్షకులకు నమస్కారం చేసి వేదిక దిగి సత్యవతీ వాళ్లు కూచున్న వేపు వస్తూ క్రీగంట శశిరేఖను చూశాడు సూర్యం ఆమె కూడా క్రీగంట చూస్తోంది అతని పెదవులపై లీలగా చిరునవ్వు మెరిసింది ఆమె ముఖం తిప్పేసుకున్నది

సూర్యం సత్యవతి, నాయుడుగారు వగైరా కూచున్న చోటకి రాబోతూ అప్పటికే తన స్థానంలోంచి లేచి గేటువైపు వడివడిగా లేచి వెళ్లిపోతున్న సత్యవతిని చూశాడు అందుకు కారణం అతనికి బోధపడక, నడకా పరుగూ కాని స్థితిలో ఆమెను జేరుకున్నాడు

గేటుకు నాలుగు గజా లివతల ఉన్న పున్నాగచెట్టు నీడలో ఆమెకు అడ్డం వచ్చాడు. సూర్యం.

"అడ్డు లేవండి" అన్నది సత్యవతి రూక్షంగా.

"ఏమయింది ?" అన్నా డతను ఆమె స్వరానికి ఆశ్చర్యపోయి

"ఏమీ కాలేదు లేవండి"

"ఇంటినుంచి ఏమయినా కబురు వచ్చిందా ?"

ఆమె నిట్టూర్చి "మీకు అనవసరం లేవండి" అన్నది విసురుగా

అతనికి అర్థమయింది

"బహుమతిని చూడకుండానే వెళ్లిపోతావా ?"

"రెండువేల రూపాయలకి రాసినా, పాతిక రూపాయలకు రాసినా చెక్కు ఒకేరకంగా ఉంటుంది" అన్నదామె అటువేపు తిరిగి

"అదంతా కోపమే ?"

ఆమె మాట్లాడలేదు

అతను రెండడుగులు ముందుకు వేశాడు కుడి చేత్తో పట్టుకున్న చెక్కును చొక్కా జేబులో పెట్టుకున్నాడు ఎడమచేతినుంచి పూలదండ వేలాడుతోంది

"నీకు ఈ విషయం చెబుదామని చాలాసార్లు అనుకున్నాను కాని సాహసించలేకపోయాను నన్ను గురించి నా వాళ్లల్లో చాలామందికి సదభిప్రాయం లేదు ధనాశ, కుచ్చితం, దుశ్శీలం అన్నీ అంటగట్టారు నాకు ఆ అభిప్రాయాలు లేకుండా నన్ను సమాదరిస్తున్నది మీ కుటుంబం ఒక్కటే. ఆటక్క ఆనరా కూడా, నా మనసు విప్పి చెప్పుకుంటే పోతుందేమోనని భయపడ్డాను సత్యవతీ! నేను పిరికివాడ్ని తప్పు అనుకుంటే క్షమించు అన్నాడు

ఆమె అతనివైపు తిరగకుండా కన్నీరు చెంగుతో ఒత్తుకుంది "బొమ్మ పంపిన సంగతయినా చెప్పవచ్చునుగా ?"

"తెలివిగలదానివి గ్రహిస్తా వనుకున్నాను. స్వంతడబ్బా వాయించుకోలేక పోయాను కనీసం యిందాక రాముడికి యిచ్చిన 'సరస్వతి' ని చూసయినా తెలుసుకుంటా వనుకున్నాను . నాన్నగారేమన్నారు" అన్నా డతను మామూలు స్థితికి వస్తూ,

"ఏమంటారు ? . ఏం బాగోలేదు అన్నారు" అన్నదామె అతనివేపు తిరిగి చిరునవ్వుతో—నీళ్లు నిండిన కళ్లతో

"ఊ ? నీ కభ్యంతరం లేకపోతే ఆ చిత్రాన్ని నీకు కానుకగా యిస్తాను"

"నన్ను నాకే యిస్తారా ?"

"ధన్యుణ్ణి దండ వెయ్యనా ?" అన్నా డతను ఆమె భుజంమీద చేయి వేస్తూ

కృష్ణమూర్తిగారు ఆ సమయంలో రకరకాల ఆలోచనల్తో సతమత మవుతున్నాడు ఆయనలో సూర్యంమీద కసి, క్రోధం, ఉక్రోషం ముప్పిరి గొంటున్నాయి కాని కొంతసేపటికి 'కసి' గెలిచి తీవ్రమయిన ప్రతీకారవాంఛ ఆయనలో బయలు దేరింది

అల్లుడూ, నీమడూ అయిన సూర్యం తన ఆస్తిమీద, డబ్బుమీద, హోదామీద ఆశ పెట్టుకుని తన కూతురికి గ్రీటింగ్‌కార్డు పంపించాడు అతనికీ పద్మావతికీ జరిగిన గ్రంథం కూడా దాన్నే ఋజువు చేస్తోంది

అతనికి డబ్బంటే పెరపెర

అందువల్ల తాను 'అభిసారిక' కు అంత ఖరీదు యిస్తానంటే . ? సూర్యం తప్పకుండా దాన్ని తనకు అమ్మివేస్తాడు ఆ విషయం ఆ తరువాత తప్పకుండా నలుగురికీ తెలిసిపోతుంది ఒకవేళ అలా జరక్కపోతే తానే అలా చేయగలడు

అప్పుడు ఏం జరుగుతుంది ?

ఆయన కుటుంబానికీ, సూర్యం కుటుంబానికీ ఉన్న సాన్నిహిత్యం లోకం ఎరుగును సూర్యం అభివృద్ధిని ఆకాంక్షించే వ్యక్తుల్లో తనకే అగ్రస్థానం యిస్తోంది లోకం అలాంటి తనకు అంత డబ్బుకి సూర్యం తను వేసిన బొమ్మ అమ్మినందుకు లోకం అతన్ని చీత్కరించుకుంటుంది తన విశాల హృదయానికీ, మంచితనానికీ నివాళిస్తుంది అప్పుడు సూర్యం తలెత్తుకు తిరగలేడు అదే తనకు కావాలి

కుక్కకాటుకు చెప్పుదెబ్బ

శశిరేఖ ఆలోచనలు మాత్రం మరో రకంగా ప్రవహించసాగినాయి ఆమెకు సూర్యం అంటే ప్రత్యేకమయిన అభిమానం ఏనాడూ లేదు తండ్రి పిలవమన్నాడు గనుక చిన్నప్పుడు కొన్నాళ్ళ 'బావ' అని పిలిచింది ఇప్పుడు అదీ లేదు గ్రీటింగ్ కార్డు పంపిన నాటినుంచి ఆమెకు అతడిమీద అసహ్యం కూడా పుట్టింది

అయితే ప్రస్తుతంలో ఆమెకు అతనిమీద కొంత అభిమానమే కలిగింది చిత్రకళాభిమాని అవడంచేత అతనిలోని కళాకారుణ్ణి ఆరాధించకుండా, అభినందించకుండా ఉండలేకపోతోంది అతని అనుచిత వర్తనను తాను క్షమించగలదు

అదే సమయంలో ఆమెకు మరో అనుమానం కూడా పట్టుకుని వేధిస్తున్నది

అంతటి కళాకారుడు, తనకు నిజంగానే గ్రీటింగ్‌కార్డు పంపదలిస్తే బజార్లో కొన్న కార్డు పంపవలసిన అవసరం ఏముంది ? హాయిగా చేతితోనే తయారుచేసి పంపవచ్చునే ?

దాన్ని నిజంగానే సూర్యం పంపలేదేమో ?

తన ఆలోచనల్ని అప్పటి కప్పుడే తండ్రితో చెప్పబోయి ఆయన ముఖ కవళికలు చూసి ఆగిపోయింది శశిరేఖ

ఆ సమయంలో వచ్చాడు రంగారావుగారు మిత్రుణ్ణి బయటకు పిలిచాడు కృష్ణమూర్తిగారు బయలుదేరటంతో ఆయనతోపాటు శశిరేఖ బయటికి వచ్చింది

"అతను ఆగకుండా ఎక్కడికో వెళ్ళిపోయాడు కృష్ణమూర్తి రేపు అతని యింటికి వెళ్ళి మాట్లాడి ఏ సంగతీ చెబుతాను" అన్నా డాయన

"ఏ సంగతి చెప్పటం కాదు పాండూ ! ఆ బొమ్మ ఏమయినా సరే నాకు కావాలి ఎంతయినా సరే యిస్తాను" అన్నాడు కృష్ణమూర్తి గారు

"ఏమిటి హఠాత్తుగా యింత అభిమానం పుట్టుకొచ్చింది చిత్రకళమీద ?' అన్నా డాయన నవ్వుతూ

"ఉందిలే .. ఇహ మేం వెళ్తాం"

"నాటకం చూడరూ ?"

"ఏముంది"

సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు రంగారావుగారు కృష్ణమూర్తిగారు కూతుర్ని వెంటబెట్టుకుని కారు ఆగివున్న చోటికి వచ్చాడు

కారు ఎక్కి స్టార్టు చెయ్యబోతూ అవతిదూరంలో పచ్చికమీద కూచుని కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్న సూర్యాన్ని సత్యవతినీ చూశా డాయన సత్యవతి మెళ్ళో దండ వేసుకుంది

"సిగ్గులేని వెధవ" అన్నాడు కసిగా కారు స్టార్టుచేస్తూ.

# 3

మధురమయిన వూహలతో ఇంటికి జేరుకున్నాడు ఆ రాత్రి సూర్యం అన్నంతిని మంచం మీద పడుకున్న తరువాత గాని మాధుర్యంలోని చేదు కనబడలేదు అతనికి

ఈ వివాహానికి తన తల్లి ఒప్పుకుంటుందా ?

సనాతనాచారాలను పట్టుకు వేళ్ళాడుతూ, నిప్పుల్ని నీళ్ళతో కడిగేటంత చాదస్తురాలు కాదు దుర్గమ్మగారు గురునాధరావుగారు బ్రతికుండగా యింట్లో వివిధ వర్ణాల సహపంక్తి భోజనాలు కూడా జరిగాయి అందుకు దుర్గమ్మగారు పెద్దగా అభ్యంతరం చెప్పలేదు కూడా

కాని ఈ విషయం వేరు

తెల్లవారి లేచి, కాలకృత్యాలు తీర్చుకుని అమ్మ యిచ్చిన కాఫీ తాగుతున్న వేళ అతడి కొక అనుమానం కలిగింది

ఆమె ఏదో చెప్పడానికి సందేహిస్తోంది

"ఏమిటమ్మా ?" అన్నా డతను కాఫీగ్లాసు కింద పెడుతూ

"నిన్న సాయంత్రం కాశీపతి వచ్చి వెళ్లాడురా" అన్నదామె

అతనికి అర్థమయింది "ఏమన్నాడు ?" అన్నాడు

దుర్గమ్మగారు చెప్పింది

"నీకు యిష్టంలేదా అమ్మా ?"

"నాకు అభ్యంతరం ఏమీలేదు నాయనా ? .... కాని నీ బతుకు సంగతి చూసుకో తెలియని వాడివి కాదు" అన్న దామె

"హాయిగా ఉంటానని మమ్మల్ని ఆశీర్వదిస్తానని మాట యివ్వమ్మా ! నీ దీవెన ఉంటే నేను ఏమయినా చెయ్యగలను." అన్నా డతను ఆమె ఒళ్ళో వాలిపోతూ

"పిచ్చివాడా ! నా కోడల్నీ, కొడుకునీ వదిలి పెట్టుకుంటానా ?" అన్నదామె అతడి తల నిమురుతూ

"చాలమ్మా ! చాలు" అన్నా డతను గద్గద కంఠంతో

అతనికి ఏనుగంత బలం వచ్చింది లేచి బట్టలు వేసుకున్నాడు మ్యూజియం హాలుకి జేరుకున్నాడు చిత్రా లన్నింటినీ ఎవరివి వారికి పంపే ఏర్పాటులో ఉన్నాడు రంగారావుగారు. సూర్యాన్ని చూడంగానే "నీ కోసమే వద్దా మనుకుంటున్నానోయ్" అన్నాడు నవ్వుకి వస్తూ

"క్షమించండి అభిసారికను నేను అమ్మ దలుచుకోలేదు" అన్నాడు సూర్యం

ఆయన విస్మయంతో "పదివేలదాకా యిస్తా నంటున్నా డాయన" అన్నాడు

"వేలకోసం కాదు అమ్మదలుచుకోలేదు"

రంగారావుగారికి యితని ప్రవర్తన కష్టం కలిగించింది అంతమందిలో తాను చేసిన ప్రకటన అబద్ధం కావలసిందేనా ?

"మరెవరన్నా ఎక్కువ యిస్తామన్నారా ?"

సూర్యం సహనం నశించింది సమాధానం చెప్పబోయి తమాయించుకుని సరాసరి పోయి 'అభిసారిక' ను తీసుకుని మ్యూజియం హాలు నుంచి బయటకు వచ్చాడు


"తొందరలేదు ! ఆలోచించుకుని మధ్యాహ్నం లోగా చెప్పు" అన్నాడు రంగారావుగారు గుమ్మం లోంచి

సూర్యం ఆగలేదు రిక్షా పిలిచి చిత్రాన్ని అందులో పెట్టి తానూ కూచుని చలపతిరావు గారి యింటి గుర్తులు చెప్పాడు పది నిముషాల్లో యిల్లు చేరాడు

అంత పొద్దున్నే సూర్యం రావటం చూసి ఆశ్చర్యపోయాడు నాయుడుగారు సూర్యం రిక్షా లోంచి దిగి డబ్బులిచ్చి 'అభిసారిక' ను తీసుకుని లోపలికి వచ్చాడు

రామం దాన్ని చూసి ఎగిరి గంతేశాడు

"ఏమిట్రా వెధవా ?" అన్నాడు నాయుడు గారు నవ్వుతూ





ఐటెక్స్
కాటుక
అరవింద్
బిందీ
కుంకుమ చాందు
ఆరు రంగులలో లభించును

అరవింద్ లేబరేటరీస్,
పి.బి 1415, మద్రాసు-17



GP



**PAKCO** ప్ాకో స్లో-స్పీడ్, కోల్డు స్టార్టింగ్ క్రూడ్ ఆయిల్ ఇంజనులు

—: ప్రత్యేక లక్షణములు :—

* పనిచేయ ప్రారంభించుట తేలిక
* తక్కువ ఇంధన ఖర్చు
* క్రమమైన నడక
* దిట్టమైన నిర్మాణం
* ఎక్కువ మన్నిక
* అద్భుతంగా పనిచేయును
* బాస్ ఫ్యూయల్, ఇంజక్షన్ పరికరములు



మద్రాసు, ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రములకు ఏజెంట్లు

Grams: LAMP **K. S. SHIVJI & CO,** (Estd 1903)
Phone: 8617 పోస్టుబాక్స నెం. 6, 178-79 బ్రాడ్వే, మద్రాసు-1.



ముచ్చట
అయిన
జుట్టు
రహస్యం...





ప్రతిరోజూ జాగ్రత్తగా తల దువ్వుకొనడమే గాక, జాగ్రత్తగా తగిన తలనూనెను ఎన్నుకొనడం కూడా జుట్టును అందంగా వుంచుకొనే రహస్యాలలో ఒకటి

పొడుగుగా, ఒత్తుగా, అందంగా జుట్టును పెంచి, అకాలంలో జుట్టు నెరవకుండాను, ఊడిపోకుండాను నిరోధించడంలో పేరెన్నికగన్నదని తెలుసుకున్నవారు కాల్ కెమికో కాస్టొరాల్ ఎన్నుకుంటారు.

అహ్లాదకరమైన సువాసన కలిగిన ఈ తలనూనె పరిశుద్ధం చేయబడిన ఆముదంతో తయారు చేయబడింది కనుక తలకు రాచుకుంటే జుట్టుకు వన్నె తెస్తుంది.

కార్టన్ గల చిన్న సీసాలోను
కార్టన్ లేని పెద్ద సీసాలోను
లభించును

CAS 1/56 Tamil

# కాస్టొరాల్

సాటిలేని నాణ్యత గల తలనూనె

ది కలకత్తా కెమికల్ కంపెనీ లిమిటెడ్.
కలకత్తా - 29

CAS-I 56 Telugu హెడ్ ఇండియా ఆఫీసు: 5/149, బ్రాడ్వే, మద్రాస్-1.


# గ్రీటింగ్ కార్డ్

రామం ఈడుకు తగ్గ పొడుగు ఉన్నవాడు. వాడికన్నా పొడుగుంది 'అభిసారిక'. ఒళ్లంతా కళ్ళు చేసుకుని సంబరంతో చూస్తున్నాడ వాడు.

సత్యవతి వచ్చింది లోపల్నుంచి

సూర్యం కృష్ణమూర్తిగారు పదివేలు యిస్తానన్న సంగతి, తాను అంగీకరించని సంగతి చెప్పాడు.

"చాలా పొరబాటు చేశావోయ్ !" అన్నాడు నాయుడుగారు

"ఆ పదివేలూ లేకపోతే బతకలేకపోను" అన్నాడు సూర్యం సత్యవతి వంక చూస్తూ

"నిజమే కాని పదివేలు వుంటే బతుకు మరింత సుఖప్రదం అవుతుందేమో ? నాకు తెలుసు నువ్వెందుకు అమ్మనన్నావో ! కాని అందువల్ల ఆమె కూడా బాధపడుతుందని వూహించావా?'

"అంటే ?"

"పదివేలతో మంచి వ్యాపారం పెట్టుకోవచ్చు సూర్యం ! నీ భార్య, పిల్లలు ఎక్కువ సుఖపడ రంటావా అప్పుడు ?"

"ఏం చెయ్యమంటారు ?" అన్నాడు నిట్టూర్చి సూర్యం

"చెప్పమ్మా" అన్నాడు నాయుడుగారు కూతురుతో

"వారికే యివ్వండి మాష్టారూ ! అందువల్ల శశిరేఖ సంతోషిస్తుంది మన పరిస్థితి బాగు పడుతుంది" అన్నది సత్యవతి

"అవును సూర్యం" అన్నాడు నాయుడుగారు.

ఎదురు చెప్పలేకపోయాడు సూర్యం. వాళ్ళు తన మంచికోరి చెబుతున్నారు. కాని తన అంతరాత్మ ఒప్పుకోవటం లేదు. వాళ్ళు చెబుతున్నట్లు చేస్తే తను పరాజయం పొందినట్లు అవుతుందేమో ?

"వెళ్లిరండి మాష్టారూ ! ఈలోగా నాన్నగారు ఫ్రేము మార్పించి ఉంచుతారు" అన్నది సత్యవతి.

అతను లేచాడు ఆలోచనల్ని బలవంతంగా విరమించుకున్నాడు ఎక్కడా ఆగకుండా కృష్ణమూర్తిగారి ఇంటిదగ్గరకు వచ్చాడు

గుమ్మంలో ఆగిపోయాడు.

"ఎవడికోసం ఒప్పుకుంటాడమ్మా ? పదివేలు ఎవడిస్తాడు అది ఎంత గొప్ప బొమ్మ అయితే మట్టుకు ? అందులో సూర్యం వదులుకుంటాడా? అంటున్నాడు కృష్ణమూర్తిగారు

"ఏమో నాన్నగారూ !" అన్నది శశిరేఖ

"నీ వలాంటి భ్రమ లేమీ పెట్టుకోకు ! డబ్బుకీ వాని ప్రాణానికీ లంకె" అన్నాడు కృష్ణమూర్తిగారు

కోపంతో, అసహ్యంతో ఉడికిపోయాడు సూర్యం ఎంత నీచులు వీళ్ళు ? వీళ్లకా తన సర్వస్వమయిన చిత్రకళా సరస్వతిని అమ్ముకునేది ?

అతను వెనక్కి తిరిగాడు. నాయుడుగారి ఇంటికొచ్చి ఆ సంగతి చెప్పాడు

వాళ్ళు నిట్టూర్చారు

* * *

తరువాత కొన్నాళ్లకి సత్యవతికీ, సూర్యానికీ వివాహం జరుగుతోందనీ తెలిసినప్పుడు కసితో మండిపోయాడు కృష్ణమూర్తిగారు. ★